# తలగోరు కుండ

**-మేరెడ్డి యాదగిరిరెడ్డి**

**కుం**డలు చేస్తే కుమ్మరి రాములే చేయాలి.
సారె తిప్పితే శ్రీకృష్ణుని చక్రంలా గిరగిర తిరిగిపోతుంది
పెళ్ళికైనా చావుకైనా రాములు చేసిన కుండలే
శ్రావణ మాసం బోనపు కుండలన్నీ రాములు చేసినవే

పెండ్లికి అవిరేణి కుండలు, కూరాడు కుండలు, శ్రావణం బోనం కుండలు, చావుకు తలగోరు కుండలు, కల్లులొట్లు అన్నీ రాములు చేతికుండలే. పెద్ద చెరువు మన్ను మహిమో, రాములు చేతి పనితనమో, వెరసివుల్లి పొరలాంటి ఖణఖణ మోగే కుండలు. రాములు కుండలు చేసి కాల్చితే నూటికి ఒక్కటి గూడ పగిలిపోదు, ఓటుపోదు.

కుమ్మరి రాములుది రెండు గదుల పెంకుటిల్లు. అవి కుమ్మరి పెంకులు. ఆ పెంకులు వాల్ల తాతల కాలం నాడు వాల్లె చేసుకుని కప్పుకున్నారు. నేటికి అది చెక్కుచెదరలేదు. ఇంటికి ఆనుకోని పెద్ద సాయమాను. తాటి కమ్మలతో కప్పింది. అంతా శిథిలమైపోయింది.

కప్పి చాలా కాలమయింది. ఆ సాయమానులో ఓ పక్క నులక మంచం, కుండలు చేసే సారె నీల్ల తొట్టి, చెక్క సారెతిప్పే కర్ర వున్నాయి. ఇంకోపక్క సాయమాను గోడకు కుండలన్నీ వరుసగా పేర్వబడి వున్నాయి. సాయమాను మీదికి సొరతీగ పారి వుంది. దాని నిండా సొరకాయలే. దాని ప్రక్క ఓ పెద్ద సర్కారు తుమ్మచెట్టు. దాని ప్రక్కనే రాములు కుండలు కాల్చే కుమ్మరి వాము. ఇంకొంచెం దూరంలో దిబ్బలుగా పడివున్న చెరువు మన్ను. వానాకాలం చెరువులో నీళ్ళు వుంటాయి కాబట్టి ఏడాదికి సరిపడా మన్ను ఎండాకాలమే తోలిపెట్టు కుంటారు.

ఇదివరకయితే సాయమాను నిండా కుండలతో కలకలలాడేది. కాలు పెట్ట సందులేనంత కుండలుండేవి. పెద్దబానలు, నీల్లగోలాలు, అవిరేణి కుండలు, మంచినీళ్ల కుండలు, అన్నం పటువలు, కూరపటువలు, మారెసరు ముంతలు, కంచుల్లు, మూతలు గుట్టలా పడుండేవి. అల్యూమినియం, స్టీలు వాడకం పెరిగి ఇప్పుడెవరు కుండలు వాడటంలేదు. ఏదో అంత అవసరమనుకుంటే తప్ప కుండలవైపు ఎవరు చూడటంలేదు కుండల వాడకం మోటయి పోయింది.

ఇప్పుడేమయినా శ్రావణం బోనాల కుండలు, ఉగాది పచ్చడి కుండలు, కుమ్మరి పొయ్యిలు, కల్లులొట్లు, పెండ్లయితే అవిరేణి కుండలు, చావుకయితే తలగోరు కుండలు ఇవే వాడకంలో వున్నవి. కాకుంటే ఎండాకాలం మంచినీళ్ల కుండలు రాములు అవే చేసి కాల్చి సాయమానులో పేర్చిపెట్టాడు.

రాములు చేయెత్తు మనిషి. ఎర్రగా బక్కపల్చగా వుంటాడు. డెబ్బయి దాటినా మనిషి చెక్కుచెదరలేదు. మోకాల్లదాక అతుకుల నూలు దోతి, ఆపైన నూలు చేతుల బనియను తలకు రుమాలు, చెవికి పోగులున్నాయి. ఇదివరకయితే చేతులకు వెండి కడియాలు, వెండి మొలతాడు వుండేవి. ఇప్పుడవేవి లేవు. రాములు భార్య ముత్యాలు. చేతుల నిండ గాజులు నుదుట ఎర్రని కుంకుమ బొట్టు. నిండు ముత్తయిదువులా వుంటుంది. ఆ వూర్లో పెండ్లయినా పేరంటమయినా, శ్రావణం బోనమైనా, ముత్యాలమ్మ దేవతకు ముందుగా ముత్యాలు చేతిమీద పెట్టవలసిందే. ఆ తర్వాతే వూరంతా బోనాలు పెట్టేది.

రాములుకు ఇద్దరు కొడుకులు, ఇద్దరు బిడ్డలు. అందరి పెళ్ళిల్లయిపోయాయి. కొంతకాలం తండ్రికి చేదోడు వాదోడుగా వున్న కొడుకులు కుండల వాడకం తగ్గాక చెరోదారి పట్టారు. పెద్దకొడుకు బొంబాయిలో పాలబేరం, రెండో కొడుకు హైదరాబాదులో ఆటో తోలి బతుకుతున్నారు.

కొడుకులు వెళ్ళిపోయాక రాములు, ముత్యాలు వంటరి పక్షులయ్యారు. కుండల వాడకం తగ్గినా రాములు కుండలు చేయడం మాత్రం మానలేదు. ఇదివరకయితే వారం వారం కాల్చేవాడు. ఇప్పుడు రెండు నెలలకో, మూడు నెలలకోసారి కాల్చుతున్నాడు. ఆ వూర్లో పదిదాకా కుమ్మరి కుటుంబాలు వుండేవి. బతుకుదెరువు లేక అంతా పట్నం బాట పట్టారు. మిగిలింది రాములొక్కడే. మంచంలో కూర్చున్న రాములు పొగాకు తీసి చుట్ట చుట్టి చెకుముఖితో నిప్పుచేసి చుట్ట వెలిగించాడు. గతంలోకి జారుకున్నాడు.

రోజులెంత మారిపోయాయి. ఇదివరకు తాను మూడు వందల అరవయి రోజులు కుండలు చేసినా సరిపోకపోయేవి. ఎప్పుడు ఏదో ఓ కుండ వెలితిగానే వుండేది. ఆ రోజులే వేరు. ఇంటింటికి నీళ్ళ గోళెం, రెండు అన్నం పటువలు, రెండు కూర అటికలు, వాటి మూతలు, మారెసరు మూతలు, కూరాడు కుండలు, పిల్లలు నీళ్ళు తాగే గురుగులు, కల్లు కంచుల్లు, అన్నం చిప్పలు ఇచ్చేవాడు. వడ్ల పంట పన్నాక అందరు 'కట్టడి'గా వడ్లు కొలిచేవాల్లు. రాములు ఇంటినిండా వడ్లే. సంవత్సరానికి సరిపడా గాసం. తను తిని నలుగురుకి పెట్టేవాడు. ఇప్పుడయితే పూట గడవడమే కష్టమయింది.

ముత్యాలు నూకలు చేటలో పోసి మట్టిపెడ్డలు, మెరిగలు ఏరుతూ ఓ పక్క కూర్చుంది. బియ్యం ధరలు పెరిగిన నాటి నుంచి వాళ్ళు నూకలే తెచ్చుకుని తింటున్నారు. నూకలయితే సగం ధరకే దొరుకుతున్నాయి.
"ఏమయ్యా! ఇయ్యాల అంగడి యాదికుందా! కుండలు కొంచబోవద్దా" రాములు ఏదో ఆలోచనలో చుట్టను ఆర్పి కిందపడేశాడు.

"నిన్నే! చప్పుడుజెయ్యవేంది. ఇంట్లో ఏం లేవు. నూకలయిపోయినయి. కారం లేదు. నూనె లేదు. ఏం లేవు. అన్ని నాల్రోజుల నుంచి బదుల్లె. శ్రావణ బోనాల కుండలు జేస్తివి అట్టినే వున్నాయి. ఇయ్యాల పోదాంపా. బండి దోలుకరా పో.. లే.. లే... పొద్దెక్కిపోతుంది" ముత్యాలు తొందర చేసింది.

"పోదామే ఆ ముత్యాలమ్మ తల్లి దయవుంటే బోనం కుండలు అమ్ముడుబోతే మనకింత బువ్వ దొరుకుద్ది. గొల్ల పెద్దయ్య బండిస్తనన్నడు. బండి కట్టుకొస్త" రుమాలు కట్టుకుంటూ అన్నాడు రాములు.

"ఈ అంగడి పోతే మన కుండలయిపోతాయి. మనపని గూడ అయిపోతది. రేపట్నుంచి చేతులు ముందల బెట్టుకొని కూసునే రోజులొచ్చినయి." రాములు విచారంగా అన్నాడు.

"అదేందయ్యా... కుండలు చేసేది బందు బెట్టి కొడుకుల కాడికి పోతవా ఏంది. నేను సచ్చినా రాను. సావయినా, బతుకయినా ఈ గూట్లోనేబడిచస్తా." గతంలో కోడండ్ల నిష్ఠూరపు మాటలు గుర్తుకు తెచ్చుకుంటూ అన్నది ముత్యాలు.

"అం గదొక్కటే తక్కువయింది. రారమ్మని పిండి బియ్యం బెట్టి పిలుస్తుండ్రు కొడుకులు. దేవుని దయ వుండి నొప్పి రోగం లేకుంటే మన చేతనయినన్ని రోజులు మన పని మనం జేసుకుంటే మన పొట్టకు బట్టకు సావులేదే."

"కుండలు కొనే దిక్కులేదురా దేవుడా అంటే, ఆ

## జల స్పర్శ కోసం

**ఎం**డిన నేల ఎదురు చూస్తుంటుంది
తొలకరి చినుకుల పలకరింపుల కోసం
కురిసే ఆ చినుకులు
ధరిత్రి ఒడిలో ఉదయించే హరిత కావ్యానికి
తొలి పలుకులు.
ఎక్కడో ఎత్తుల్లో వున్న ఆకాశానికి
ఇక్కడ ఈ దిగువున వున్న అవనికి
ఏమి అనుబంధమో.
అంతస్తులు వేరు వేరైనా
అవ్యాజ స్నేహ బంధంలో ఒదిగిపోయే
రెండు హృదయాల సంగమానికి ప్రతీక అది.
పచ్చగా పైపైకి ఎదిగిపోయే చెట్లకొమ్మలు
తమ జన్మలకు దోహదం చేసిన గగనమూర్తికి
నమస్కరించడానికెత్తిన చేతుల్లా అగుపిస్తాయి.
ఒక్కొక్క వానచుక్క
మొగ్గల చెక్కిళ్లను వొయ్యారంగా నిమురుతూ వుంటే
అవి పువ్వులయ్యే తరుణం రానే వచ్చిందని
చెవిలో మౌనంగా చెప్పినట్టుగా వుంటుంది.
మట్టి ఎప్పటికప్పుడు కలవరిస్తుంటుంది
వాననీటి కరస్పర్శ కోసం.
ఆ స్పర్శతో మొలకెత్తే పులకాంకురాల
ఆవిష్కృతులే
లేలేత గరికపోచలు.
పరస్పరం కలుసుకోవాలని ఆరాటపడే మనసులకు
ఎంతటి శరీరాలైనా
ఎప్పుడూ సహచరంగానే వుంటాయి.
అందుకు ప్రత్యక్ష నిదర్శనం
భూమ్యాకాశాల నిరంతర సమైక్యతా దృక్పథం.

**-డా॥ సి.నారాయణరెడ్డి**

మాయదారి కంపెనీ వోటి చెరువును గుత్తకు తీసుకున్నరట. మన కుండల మన్ను దొరికే కాలం లేదు. చెరువు చుట్టు తంబాలు పాతి ఇనుప తీగ చుట్టింగ్రు. కాకిని వాలనిస్తలేరు."

"సరే.. దబ్బున ఇంత వండు. బండిదోలుకొస్త, అంగడి బోదాం"

చెప్పులేసుకుని బయటకు నడిచాడు రాములు. రాములు మాటలతో ముత్యాలు తల తిరిగి పోయింది. చాటలో చేతులుంచి రాములు వెళ్ళిన వైపే చూస్తూ కూర్చుండి పోయింది.

ఆ ఊరిలో ఓ మూడొందల ఇండ్లు, వెయ్యి దాకా జనాభా వుంది. అంతా వ్యవసాయమ్మీద బతికేవాల్లే. ఆ వూరి చెరువు పెద్దది. ఒక్కకారు నిండితే చాలు రెండు కార్లు పంట పండుతుంది. ఆ చెరువు మట్టి కుంకుమలా వుంటుంది. చూద్దామని భూతద్దం పెట్టి చూసినా చిన్న రాయిముక్క కనిపించదు. అందుకే చుట్టూ పదూర్ల కుమ్మర్లు కుండలకు ఆ మట్టినే తోలుక పోతుంటారు. ఎండాకాలం వచ్చిందంటే ఆ చెరువులో జాతరే మరి. రైతులు పొలాలకు మన్ను తోలుడు, కుమ్మర్లు కుండలకు మన్ను తోలుడు... అంతా సందడి సందడిగా వుంటుంది. ఓ నెల రోజులు ఇదే తంతు. ఊరు పశువులన్నీ ఆ చెర్లోనే మేస్తుంటాయి. గొల్లోల్లు గొర్ల మేపుడు, చాకలోల్లు బట్టలుతుకుడు అక్కడే. వెరసి ఆ చెరువు వారికి కన్నతల్లిలా ఉపయోగపడుతూ వుంది.

ఆ చెరువు మట్టితో కుండలు చేస్తే చేసినట్టే అనిపించదు. ఏ కుండంటే ఆ కుండ, ఏ ఆకారమంటే ఆ ఆకారంలో దిగుతాయి. రాములు సారె తిప్పితే చాలు నిమిషాల్లో కుండ కిందికి దిగిపోతుంది. ముత్యాలు తీసి ఆరబెడుతుంది. రెండు రోజుల్లో వాములోబెట్టి కాల్చవచ్చు. అందుకే రాములుకు ఆ చెరువంటే అంత ప్రేమ.

అలాంటి ఆ వూరి పెద్దచెరువు తమది కాకుండా పోయింది. ఓ బడా కార్పొరేట్ కంపెనీ అధిపతి కండ్లు దానిమీద పడ్డాయి. గుట్టుచప్పుడు కాకుండా ఆ చెరువు మట్టిని ల్యాబ్‌కు పంపి ఎనాలిసిస్ చేయించాడు. ఫలితాలు అద్భుతంగా వచ్చాయి. సిమెంట్ కంపెనీకయినా, ఇటికల కంపెనీకయినా ఆ మన్ను తిరుగులేనిదని తేలింది. అదిగాక ఆ చెరువు శిఖంభూమి దాదాపు ముప్పై ఎకరాలు వుంది. అది ప్రభుత్వ భూమి. ఎలాంటి పేచీ వుండదు.

ఆ కంపెనీ యజమాని ఓ కేబినెట్ మంత్రికి అతి సన్నిహితుడు. సదరు మంత్రిగారి కొడుకుకు ఆ కంపెనీలో వాటాలున్నాయి. తన ఇటికల కంపెనీకి పెద్దచెరువులోని భూమి 'సెజ్'గా యివ్వాలని ప్రభుత్వానికి దరఖాస్తు చేశాడు. తన కంపెనీ ఆ ఊరిని అభివృద్ధి చేస్తుందని, ఆ ఊరివారందరికి ఉపాధి లభిస్తుందని నమ్మబలికాడు. ఆగమేఘాల మీద ఆ చెరువు 'సెజ్' రూపంలో కంపెనీకి దారాదత్తమయింది.

అంతకు ముందు ఓ తంతు జరిగింది. ప్రభుత్వం పంచాయతీ తీర్మానం అడిగింది. కంపెనీ వారు ఆ ఊరు పంచాయతీ ప్రెసిడెంట్ ప్రసాదరావును, ఇతర సభ్యులను భారీ ముడుపులతో మేనేజ్ చేశారు. తమకు అనుకూలంగా తీర్మానం చేయించుకున్నారు. ప్రసాదరావుకైతే హైదరాబాదులో ప్లాట్ కొనిచ్చారని ప్రచారం జరిగింది.

కంపెనీ వారు తమ ఇటికల కంపెనీలో ఓ పది రోజులు ట్రాక్టర్లకు కూలీల చేత మట్టి ఎత్తించి పని చూపించారు. చెరువులో మట్టి ఎత్తుడు, చెరువు వార ఇటుకల తయారీ, కూలీల గుడిసెలు వెలిశాయి. ఊరి జనం తమకు పని దొరికిందని మురిసిపోయారు. వాళ్ళ ఆశలు ఆట్టే రోజులు నిలువలేదు. పని త్వరగా జరగడం లేదని కంపెనీ వాళ్ళు చెరువు నిండా మిషనరీ దింపారు. మట్టి ఎత్తే ప్రొక్లెయిన్ల, టిప్పర్లు, లారీలు, ట్రాక్టర్లు భారీగా దింపారు. ఇటుకల చేసుడు గాక మట్టిని సిమెంటు కంపెనీలకు తోలడం మొదలు పెట్టారు.

కుమ్మరి రాములు, గొల్ల పెద్దయ్య, చాకలి నర్సయ్య, జంగిడి పశువులు మేపే మోషె, నల్లపురెడ్డి, గోవిందు లాంటి రైతులు అంతా ఇరవై, ముప్పై మంది చెరువు గురించి ప్రెసిడెంటును అడుగుదామని బయలుదేరారు.

ప్రసాదరావు, ఉపసర్పంచ్ రామిరెడ్డి, ఇంకో నలుగురయిదుగురు ఇంటి ముందు వరండాలో కూర్చుని మాట్లాడుకుంటున్నారు. తన ఇంటివైపు వచ్చే జనాన్ని ప్రసాదరావు చూశాడు. వారం రోజుల నుంచి చెరువు గురించి వూల్లో జరుగుతున్న చర్చల గురించి తెలుసుకున్నాడు. ఎలాంటి సమస్యనైనా ఇట్టే పరిష్కరించడం, మనుషులను తన మాటలతో మాయ జేయడం ప్రసాదరావుకు వెన్నతో పెట్టిన విద్య.

"రాండి, రాండి. అందరొక్కసారే వస్తున్నారు. రాండి, కూర్చోండి" ఎదురుగా వున్న కుర్చీలు, బెంచీలు చూపించాడు. కొందరు కూర్చున్నారు. రాములు, గొల్ల పెద్దులు లాంటి వారు నిల్చునే వున్నారు. కాసేపు ఎవరు మాట్లాడలేదు.

"ఏంది దొరా గిట్లజేసింగ్రు. మేమెట్ల బతుకాలె చెప్పండి. తల్లిలాంటి చెరువును కంపినోల్లకు గుత్తకిస్తిరి. గొడ్డూ గోదా మేసేది, బట్టలుతుక్కునేది. మా కుండలకింత మన్ను దొరికేది. వూల్లె వుండమంటరా పొమ్మంటరా చెప్పండ్రి."

గోడకు కర్ర ఆసరాతో నిలబడ్డ రాములు అడిగాడు.

"మేం బట్టలాడ వుతుక్కోవాలి దొరా" చాకలి నర్సయ్య.

"మేమెక్కడ గొర్ల మేపుకోవాలే" గొల్ల పెద్దులు.

"మేం జంగడి పనులు యాడ మేపుకోవాలె" మోషె ప్రశ్న.

"మా పొలాలకు మట్టి యానించి తోలుకొవాలె మీరే చెప్పురి" పది మంది రైతుల ప్రశ్నల పరంపర.

పద్మవ్యూహంలో అభిమన్యుని మీద బాణాల్లా ప్రసాదరావు మీద నాలుగు వైపుల నుండి ప్రశ్నల వర్షం. అక్కడ కూర్చున్న ప్రసాదరావు మనుష్యులు ఒకరి ముఖం ఒకరు చూసుకున్నారు. కాసేపట్లో ప్రసాదరావు తేరుకున్నాడు. "చూడండి, మీరు చెప్పిన మాటలన్నీ నిజమే. నేను కాదనను. నేనేది చేసినా మన వూరి బాగుకొరకే చేశా. కంపెనీ వాళ్ళకిచ్చింది మూడేండ్లే. మనమియ్యకున్న అది సర్కారు భూమి. సర్కారు వాల్లకిస్తె మనమేం చేయలేం. కాస్త బెట్టుచేసి మన వూరు బాగుపడేటట్టు చేశా."

"అదిగాక చెరువంతా పూడిపోయింది. ఇదివరకు చెరువు నిండితే రెండు కార్లు పంట పండేది. ఇప్పుడు ఒక్క కారుకు కూడ నీళ్ళు సరిపోవడంలేదు. మనమెంత యెత్తినా పదేండ్లయినా అడుగు మందం వదలదు. వాళ్ళు

## మెసేజ్.. మెసేజ్.. మెసేజ్

**నా** ఉనికి / నీ కళ్ళ కిటికి
మేలుకున్నప్పుడు నీవే నా ధ్యాస
నిదురించేటప్పుడు నువ్వే నా శ్వాస
నెలవంక ప్రక్కనే నక్షత్రం
నీ పాదాల క్రిందే నా హృదయ క్షేత్రం
పగలు రేయి లయతో కదా! ఈ లోకం
నీ నా కలయిక కదా! ప్రేమకు మూలం
కళ్ళుమూస్తే నా కలలలో నువ్వు
కళ్ళుతెరిస్తే నా రెప్పల వలలో నీ నవ్వు
నీ కురులలోంచి అంబరాన్ని వెలికితియ్యనా!
నీ సిగలో కనకాంబరమై వెలుగు రువ్వనా!
నీ కాళ్ళతో నా నడక నా కళ్ళతో నీ చూపు
నీ పెదవితో నా పదం నా గుండె నీ రూపు
నీ కంటిపాపలో రూపుదిద్దుకున్నది వీడే
నా గుండెలయ నీ కనురెప్పల చప్పుడే
నీకోసం తపనపడే ప్రతి క్షణక్షణం
కవితగా రూపుదిద్దుకుంటుంది ప్రతి అక్షరం
మనసునిండా బాధల అగ్నిగుండం
మనిషి గుండెలో ప్రేమ ఓ మంచు ఖండం
కళ్ళు తెరిస్తే నువు నా చూపుల గుప్పిటలో బంధీ
మన కనురెప్పల కోలాటం ప్రేమకు జుగల్‌బంధీ
నీకు మాత్రమే తెలుసు నన్ను ప్రేమించడం
మనకు మాత్రమే తెలుసు ప్రేమతో జీవించడం
నీ నా ప్రేమ రెండు చూపుల నదుల ప్రవాహం
చివరకు ఒకటిగా విడదీయలేని సముద్రం
తుమ్మెదకు పూవు చాలు పూలతోట చాలు
నాకు నువ్వు చాలు నీ నవ్వులు చాలు
నీ కనురెప్పలలో నను బంధించు
నా కళ్ళలో శాశ్వతంగా జీవించు
నాలోని నువ్వు నీలోనే నా నవ్వు
ప్రేమ మన పెదాల మధ్య ఏనాడు వాడని పువ్వు
ఒక్కడినే వున్నప్పుడు నేనో మౌన శిఖరం
నీతో నేనున్నప్పుడు నేనో గాన సమీరం
లోకానికి ఉదయం నాకు నీ హృదయం
ప్రేమ ఓనాడు నా స్వప్నం నేడు నా జీవిత సత్యం
ఎన్ని పదాల నదులు జనించినా
తీరదు పెదాల దాహం / ఎన్ని జన్మలు గడిచినా
మారదు ప్రేమ హృదయం/ఆకు వక్క సున్నం నమిలితే
నోరు ఎర్రగా పండుతుంది
నీ చూపు మాట స్పర్శ నే తాగితే
నా గుండె ప్రేమతో నిండుతుంది
గొంతులో దాచుకో నేనో సుస్వరం
గుండెలోనే ప్రేమ రుధిరం/నీ తనువులో నేనే ప్రాణం
నా అణువణువులో నీవే ప్రేమ పరిమళం
నాకు తెలుసు నను ప్రేమించడానికే పుట్టావని
నా కోసమే నీవు జీవిస్తున్నావని
కానీ! నీకు తెలియదు నేనెవరినని
నాకు నిన్ను ప్రేమించడం తప్ప ఏమీ తెలియదని
మేఘంలో నీరు మొక్కకు కనిపిస్తుంది
ప్రేమ హృదయమున్న వాళ్ళకు మాత్రమే అగుపిస్తుంది
ప్రేమ చాలామందికి కొన్ని రోజులకు
మరచిపోతున్న నెలల అనుభూతి
మనకు మాత్రం తరతరాలుగా మన రక్తంలో
ప్రవహిస్తున్న కలల సంస్కృతి
పూవు విరియకుంటే తుమ్మెదవాలదు
చినుకు పడనిదే మొలక ఆకాశాన్ని ముద్దిడదు
నీరెండ లేనిదే ఇంద్రధనస్సు ఏర్పడదు
నీ అండ లేకుంటే ఈ చిన్ని గుండె ఆడదు
సూర్యునికి ఉభయ సంధ్యలు
చంద్రునికి అమవాశ్య పున్నములు
మనిషికి జనన మరణాలు
హృదయానికి ప్రేమకు నీవు నేను నిర్వచనాలు
ప్రపంచంలో అతి పెద్ద పేదరికం
ప్రేమలో ప్రేమతో జీవించలేకపోవడం.

-వై. శ్రీరాములు

## జీవ(న) చిత్రం

పేదరికం / కొండ చిలువై
కబళించిన చోట / భవిత
సమాధి అయ్యింది!
మొగ్గదశలోనే / ఎన్నో ఆశలు
ఆకలి గుమ్మానికి / ఉరిపోసుకున్నాయి!
అక్షరం / కాంతి రేఖల్ని
ప్రసరించాల్సిన క్షణాన / అందని ద్రాక్షలా
అందనంత ఎత్తుకు పాకుతూ
ఆకాశ అంచుల్ని తాకింది!
జీవిత పుస్తకంలో / లేలేత బాల్యానికి
చెదపురుగు పట్టి / కలల్ని కాలరాస్తోంది!
జీవన పథాన / పోరాటం అనివార్యమై
ఛిద్రానుభూతుల / హృదికి
చితిమంటల చిచ్చు రగిల్చింది!
బలపం / పట్టాల్సిన చేతులు
బ్రతుకు తెరువు బాటలో / రకరకాల
జీవ(న) చిత్రువుల
ప్రాణరేఖా సదృశ సముదాయాలై
వీధి కూడలిలో
ఆవిష్కృతమవుతూ
పోరాడుతున్నాయి!
అమ్మతో
ఆడుకోవాల్సిన వయసులో
గుప్పెడు మెతుకుల్ని
గుప్పిట పట్టే
విలువిద్యలో
కర్మాగార షెడ్డుల్లో
మత్స్య యంత్రాలై వేలాడుతున్నారు!
కష్టాల గాటిన సాగే
గానుగెద్దు జీవితాంకంలో
అన్నీ ఆకలి సూత్రాల
మెళకువల మథింపులే!
అమ్మ ఒడి వెచ్చదనానికి
ఆటపాటల ఆనందానికి
వెలియై నిలిచే
దుర్భర దారిద్ర్య సాక్ష్యాలు వీరు!
బాల్యాన్ని బాల ఏసుల్లా
బరువుగా సిలువ మోస్తూ
వెట్టిచాకిరీ బాధ్యతల ముళ్ళ కిరీటాలతో
నలిగిపోతున్న
చేదు గురుతుల నేటి ఆనవాళ్లు వీరు!
చిత్తశుద్ధి లేని చట్టాల చిట్టాలు
కంటితుడుపు పథకాల హంగామా పన్నాగాలు...
**ఎన్ని కడుపు మంటలు ఆర్పగలవు?!**
**ఎన్ని కన్నీళ్లు తుడవగలవు?!**
బాల్యం / మధుర జ్ఞాపకాల గుడి...
పసిడి స్మృతుల జడి...
అందుకే...
బాల్యాన్ని బలికాకుండా బ్రతికిద్దాం!
భావి భారతావనికి జీవం పోద్దాం!!

-వంగర పరమేశ్వరరావు

తప్పితే మూడేండ్లలో లోతవుతుంది."

"మన వూరంతా తారు రోడ్లు వేస్తామన్నారు. మెయిన్ రోడ్డు నుండి మన వూరిదాకా బి.టి. రోడ్డు వేస్తునే వున్నారు. మీరంతా చూస్తూనే వున్నారు. ఊరి నిండా లైట్లు వేస్తామన్నారు. బడి, దవాఖానా కట్టిస్త మన్నారు. అదీగాక ఇంటికొకరికి వాళ్ళ కంపెనీలో నౌకరిస్తమన్నారు. ఇంకే గావాలో చెప్పురి. అది పెద్ద కంపెనీ. వాళ్ళతో పెట్టుకుంటే మనం గెలవలేము. అందుకే వొప్పుకొన్నం". "ఇక అందరి అవసరాలకు వూరకుంట వుండనే వున్నది. అది అంత చిన్నదేం గాదు. పెద్ద చెరువుకు కుడి ఎడమ అంతే. ఆ మన్ను పొలాలకు తోలుకోవచ్చు. రాములు కుండలు చేసుకోవచ్చు. గొర్లు, బర్లు మేపుకోవచ్చు. బట్టలుతుక్కోవచ్చు. దానికూడ మీ కోసమే పంచాయతీ తీర్మానం చేయించిన."

ప్రసాదరావు తన మాటలతో అందరిని చల్లబర చిందు. అక్కడ కూర్చున్న వాళ్ళంతా రావుకు వంత పాడారు. గుడ్డిలో మెల్ల ఇదికాస్త బాగానే వుందని అందరూ లేచి వెళ్ళిపోయారు.

ఇది జరిగాక నెల రోజులకు ప్రసాదరావు తల్లి పెద్దదొరసాని సావిత్రమ్మ చనిపోయింది. వార్త ఊరంతా తెలిసిపోయింది. చుట్టాలందరికి ఫోన్ల మీద వార్త వెళ్ళిపోయింది. పుణ్యాత్ములాలన్నారు. అక్కడికి వచ్చినవాళ్ళు. నిన్నటిదాకా బాగానే వుంది, తెల్లారే వరకే పోయింది. వూరంతా చెప్పుకుంటూ చెట్ల కింద నిలబడ్డారు. ఇంటి ముందు పెద్ద టెంట్లు వేసి కుర్చీలు వేశారు. సాయంత్రానికి వచ్చే వాళ్లంతా వచ్చేశారు. అమెరికాలో వున్న ప్రసాదరావు కొడుకు మాత్రం తాను రాలేను కానిచ్చేయమని ఫోను చేశాడు.

ప్రసాదరావు బావమరిది భుజంగరావు. ఉపసర్పంచ్ రామిరెడ్డి, ఇంకో నలుగురు పెద్దమనుషులు ఏర్పాట్లన్నీ చూస్తున్నారు. అటూ ఇటూ తిరుగుతూ అందరికి పనులు చెబుతున్నారు. సావిత్రమ్మను వరండాలో గడ్డిపరచి పడుకోబెట్టారు. తల దగ్గర మట్టి దీపంలో దీపం వెలిగించారు. వూదికడ్డీలు కాల్చారు. నిండా దండలు వేశారు. ఊరి వారు, వచ్చిన చుట్టాలు చూసిపోతున్నారు. ఆ పక్కన ప్రసాదరావు విచారంగా ఓ కుర్చీలో కూర్చున్నాడు. ఆయన దగ్గరకొచ్చిన వాళ్ళు సావిత్రమ్మ గుణగణాలు చెప్పి ఓదార్పు మాటలు చెపుతున్నారు. ఇంటి ముందు ఓ మొద్దుకు నిప్పంటించి పెట్టారు. అది రాజుకుంటూ వుంది.

"ఒరేయి పొద్దుగూకొస్తోంది కట్టె కొట్టింద్రా, కాష్టం పేర్చింద్రా" పాడెకట్టే వాళ్ళనడిగాడు భుజంగరావు.

"అయిపోయింది దొరవారు. చెట్లుగొట్టి పెద్దొరగోరి పక్కంటనే పొద్దున మీరు చూపించిన దగ్గరనే కాష్టం పేర్చినం. ఓ నలుగురు అక్కడున్నరు. మేం నలుగురం పాడె కట్టెలు తీసుకోని వచ్చినం. పాడె కట్టుడు గూడ అయిపోవచ్చింది" అన్నారు.

"ఒరేయ్ నర్సిమ్మ.. కొత్త గుడ్డ, బొంగులు, చిల్లర పైసలు, బుక్కగులాలు తెచ్చినావురా" రామిరెడ్డి అడిగాడు.

"తెచ్చిన దొరా. గుడ్డ, బొంగులు, చిల్లర పైసలు, బుక్కగులాలు ఇగో" చాకలి నర్సిమ్మ తాను తెచ్చిన బస్త మూట భుజంగరావు, రామిరెడ్డికి చూపించాడు.

డప్పుల వాళ్ళు పెద్ద మంటజేసి డప్పులు కాపు తున్నారు. అరంబాజలోల్లు, కొమ్ముపూదేవాళ్ళు, సన్నాయి, బ్యాండమేళగాళ్ళు, గంగెడోల్లు, భజన బృందం, వీరంగం తొక్కేవాళ్ళు... ఇలా ఎవరి పనుల్లో వాళ్ళున్నారు. భుజంగరావు అందరికి బాగానే ముట్ట చెప్పాడు. అందరు నాటుసారా ఫుల్‌గా కొట్టి మూడో సుతిలో వున్నారు.

చీకటి పడుతుంది, తొందరగా తీయాలని పెద్ద మనుషులు తొందర పెడుతున్నారు. ప్రసాదరావు దొరవారు తానంజేసి కుండల నీళ్ళు దెస్తే పని మొదలవు తుందని చాకలి నర్సయ్యన్నాడు.

"అరే కుండేదిరా తలగోరు కుండ... తలగోరు కుండ" నలుగురయిదుగురు ఒకేసారి అన్నారు. అంతా హడావిడి చేశారు. "అసలు ప్రతానం తలగోరు కుండ లేంది" ఇప్పుడెట్లా తలా ఓ మాటన్నారు.

"కుమ్మరి రాములేడిరా. ఎవరు చచ్చినా ముందు వచ్చి నిలబడే రాములుకేమయిందిరా" రామిరెడ్డి అరిచాడు.

"రోజు వచ్చి ఈ చెట్ల కింద కూచొని దొరసానిని ఇంత తొక్కో కూరో, చల్లో అడుక్కపొయ్యేటోడు. ఇయ్యాల ఎక్కడ మాయమయాడురా" చాకలి నర్సయ్య వైపు చూస్తూ రామిరెడ్డి అన్నాడు.

గుంపులో నుండి ముత్యాలు ముందుకు వచ్చింది.

"అయ్యా మూడ్రోజుల నుంచి వొక్కటే జరం. మంచంల నుంచి లేస్తలేడు. ఏం తాగుతలేదు. మన్నయి పోతే ఆ వూరకుంట మన్నుదెచ్చిండు. రెండు రోజులు నానబోసిండు. ఇగతొక్కిండు ఇగతొక్కిండు. ముద్దబడ లేదు. వారం రోజులు తిప్పలబడి కుండలు జేసి వాముకు ఎక్కించి కాల్చిండు. ఇంక అది ఇప్పనేలేదు. అడ్డం బడ్డడు."

"దొరసాని సచ్చిపోయిందంటే ఆగేటోడ. పొద్దుంలేస్తె ఇక్కడ తిరిగేటోడు" ముత్యాలు కండ్లొత్తుకుంది.

రామిరెడ్డి మోటరు సైకిలు మీద చాకలి నర్సయ్యను కూర్చోబెట్టుకుని రాములు ఇంటివైపు వెళ్లాడు. వాళ్ళ వెనుకే ముత్యాలు ఇల్లు చేరింది. మంచంల నుండి రాములును లేపుకొచ్చి కుండల వాము విప్పమన్నారు. ముత్యాలు ఆసరాతో పైన బూడిదంతా పక్కకు తోశాడు రాములు. కుండలు ఒక్కొక్కటి తీయడం మొదలు పెట్టాడు. ఒక్క కుండ తీసినా ఇప్పటి పని జరుగుతుందని అందరూ ఆత్రంగా చూస్తున్నారు. ఏ కుండ పక్కకు తీసినా చేతిలోనే పచ్చులు పచ్చలయి పోతున్నాయి. వాములోని కుండలన్నీ తీసినా ఒక్కటీ చేతికి రాలేదు. అవన్నీ పగిలిపోయాయి. పగిలిన పెంకుల చూస్తూ రాములు అలానే వుండిపోయాడు.

"అయ్యో రాములు ఇట్లయిందేంది. ఎన్నడన్నా నీచేతి కుండ పగులకుండ వచ్చేది" రామిరెడ్డి ఆదుర్దాగా అన్నాడు.

"ఏంజెయ్యమంటరు చెప్పుండ్రి. అప్పుడు చేసిన కుండలు పెద్దచెరువు మట్టి. ఇప్పుడు చేసినవి ఊరకుంట మట్టితో. మన్ను తొక్కుడుబడక, ముద్దగాక, తొక్కి తొక్కి మూడు రోజుల నుంచి జరంలబడ్డ" లోగొంతుకతో రాములు అన్నాడు.

రామిరెడ్డి, చాకలి నర్సయ్య, ఇంకో నలుగురు నాలుగు మోటరు సైకిళ్ళు తీసుకొని తలగోరు కుండ కోసం నల్లగొండ వైపు పరుగే పరుగు. ■